క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



వెంకటాపురం(కె): ఏజెన్సీలో ఉన్న నేతకాని కులస్తుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏజెన్సీ నేతకాని సంఘం వ్యవస్థాపకుడు జాడి ఈశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని బెస్తగూడెం గ్రామంలో ఏజెన్సీ నేతకాని సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీలో ఉన్న నేతకాని కులస్తులకు ఏజెన్సీ చట్టాలు వర్తింపజేయాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల జీవితాలతో ప్రభుత్వాలు చలగాటమాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో నివసిస్తున్న బడుగు బలహీన వర్గాల వారు ఏజెన్సీ చట్టాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జాడి ముత్తయ్య, దుర్గారావు, సమ్మయ్య, వెంకన్న, శ్రీధర్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

నేడు డివిజన్ స్థాయి సమావేశం



మల్హర్: మహదేవపూర్‌లో నేడు(శుక్రవారం) నిర్వహించనటున్న ఎమ్మార్పీఎస్ మంథని డివిజన్ స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కేసారపు నరేష్ పిలుపునిచ్చారు. మండలంలోని కొయ్యూరు ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో నరేష్ మట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జ్ కల్వల శరత్‌కుమార్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు బట్టు విజయ హాజరవుతున్నట్లు తెలిపారు. డివిజన్‌లోని నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మహదేవూపర్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్, కాటారం మండల అధ్యక్షుడు మంథని చిరంజీవి, అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు మంథని సమ్మయ్య, దుర్గయ్య, సిద్ధు, ధర్మయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

రేగొండ: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని రేపాకలో గురువారం చోటు చేసుకుంది.



శిరీష (ఫైల్)

పోలీసుల కథనం ప్రకారం .. రేపాక గ్రామానికి చెందిన మండల శిరీష(25) అదే గ్రామానికి చెందిన శివను ఐదు సంవత్సరాల క్రితం కులాంతర వివాహం చేసుకుంది. వారికి ఇద్దరు కుమార్తెలు కాగా శిరీష కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేదని, ఆర్థిక స్థోమత లేని కారణంగా స్థానిక ఆర్‌ఎంపీ వద్దనే చికిత్స పొందుతూ ఉండేదని తెలిపారు. గురువారం ఉదయం శిరీష భర్త కూలీ పనులకు వెళ్లగా ఆలస్యమైనా నిద్ర లేవకపోవడంతో శిరీష తల్లి పల్లె బోయిన శాంత నిద్రలేపే ప్రయత్నం చేయగా ఎంతకూ నిద్ర లేవకపోవడంతో భయంతో కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని మృతి చెందినట్లు గుర్తించి పోలీసులు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్సై రవికుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. కాగా మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని వేశాలపల్లి గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణ పనులకు, సెగ్గంపల్లి గ్రామంలో రామాలయం గుడి ప్రహరీ నిర్మాణ పనులను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండు పథకాలు అమలవుతున్నాయని, ఈ నెల నుంచి రూ.500కు గ్యాస్, 200 యూనిట్ల ఫ్రీ విద్యుత్ పథకాలు అమలువుతాయన్నారు. ఈ కార్యక్రమాల్లో భూపాలపల్లి మండల రూరల్ అధ్యక్షుడు సుంకరి రామచంద్రయ్య, పార్టీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, కురిమిల్ల రజిత శ్రీనివాస్, శిరుప అనిల్, రవీందర్, పార్టీ నాయకులు ఆకుల మహేందర్, క్యాత రాజు సాంబమూర్తి, బుర్ర కొమురయ్య, గురిజాల రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవాలాల్ మార్గం అనుసరణీయం

సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గం అందరికీ అనుసరణీయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జిల్లా సేవాలాల్ సేనా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని భారత్ పంక్షన్‌హాల్‌లో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సేవాలాల్ పేరిట కమ్యూనిటీహాల్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సేవలాల్ సేనా ఉత్సవ కమిటీ సభ్యులు దేవస్, సురేష్, రాజు, సంతోష్, జంపయ్య, తిరుపతి, మోహన్, సమ్మయ్య, కిషన్, నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.



జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కేసీఆర్ అవినీతికి నిదర్శనం 'కాళేశ్వరం'

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రకాశ్‌రెడ్డి

కాటారం: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్పడిన అవినీతికి నిదర్శనం కాళేశ్వరం ప్రాజెక్ట్ అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి, కాటారం ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. కాటారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు చేపట్టిన చలో మేడిగడ్డను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను మేడిగడ్డ లోపాలను చూపించడానికి ఆహ్వానించినప్పుడు రాని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఇప్పుడు సందర్శనకు రావడం హాస్యాస్పదం అన్నారు. ప్రాజెక్ట్ కోసం లక్షల కోట్ల ధనం ఖర్చు కోసం వేల కోట్లు అక్రమంగా సంపాదించుకున్నారని విమర్శించారు. ఈ ప్రాంత బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాళేశ్వరం ప్రాజెక్ట్ భూ సేకరణలో రైతులను బెదిరించి కోట్లాది రూపాయల పరిహారం అవినీతికి పాల్పడ్డారని చెప్పారు. దానిని కప్పిపుచ్చుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన ప్రతి అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ చేపడుతుందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరిట కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడిన వారు చలో మేడిగడ్డకు రావడం విడ్డూరమని తెలిపారు. ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే మేడిగడ్డలో అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి విలాస రావు, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, డీసీసీ ఉపాధ్యక్షుడు గద్దె సమ్మిరెడ్డి, ఎంపీటీసీలు మహేశ్, రవీందర్‌రావు, మంచినీళ్ల దుర్గయ్య, విజయారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం



డీసీఓకు అవిశ్వాస తీర్మాన కాపీ ఇస్తున్న డైరెక్టర్లు

మల్హర్: మండలంలోని తాడిచర్ల పీఏసీఎస్ చైర్మన్ చెప్యాల రామారావుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. చైర్మన్‌పై ఆ సంఘం ఏడుగురు డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం కోరుతూ.. భూపాలపల్లి డీసీఓ శైలజకు గురువారం అవిశ్వాసం తీర్మానంపై సంతకాలు చేసిన ప్రతాన్ని కొంత మంది డైరెక్టర్లు అందించారు. సొసైటీలో 13 మంది డైరెక్టర్లలో రామారావును సంఘం చైర్మన్‌గా గతంలో ఎన్నుకున్నారు. కాగా, ఓ డైరెక్టర్ అనారోగ్యంతో మృతి చెందాగా ప్రస్తుతం చైర్మన్‌తో కలిపి 12 మంది డైరెక్టర్లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మొండి, తిరుపతిరావు, ప్రకాశ్‌రావు, సర్వేనాయక్ ఉన్నారు.

బాలికలు మనోధైర్యంతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎంపీపీ పంతకాని సమ్మయ్య

కాటారం: బాలికలు మనోధైర్యంతో ముందుకెళ్లాలని ఎట్టి పరిస్థితుల్లో ఆత్మస్థైర్యం కోల్పోవద్దని ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. మండలం కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో గురువారం విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల దశ ఎంతో ముఖ్యమైందన్నారు. చెడు వ్యసనాలు, ఇతర వ్యాపకాలకు దూరంగా ఉండి కేవలం చదువుపై మాత్రమే దృష్టి సారించాలని సూచించారు. క్రమశిక్షణతో మెదులుకొని చదువులో రాణించాలన్నారు. ఏదైన సమస్యలు ఎదురైతే వసతి గృహం వార్డెన్ లేదా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లాలే తప్ప ఎలాంటి క్షణికావేశ నిర్ణయాలు తీసుకోవద్దని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు సెల్‌ఫోన్‌లు ఇవ్వొద్దని తెలిపారు. విద్యార్థినుల్లో మనోధైర్యం నింపేలా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయినులు మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహం అధికారిణి భవాని, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయినులు సుజాత, పద్మజ, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



సన్మానిస్తున్న ప్రభాకర్, శ్రావణ్

మల్హర్: మల్హర్ మండల తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కుంబాల రవికుమార్‌ను నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యులు గురువారం మర్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను మండలంలోని తాడిచర్ల తహసీల్దార్ కార్యాలయంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా ఉపాధ్యక్షుడు ముడుతనపల్లి ప్రభాకర్, మంథని నియోజకవర్గ సభ్యులు ఉట్నూరి శ్రావణ్‌కుమార్ శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులతో విద్యార్థులు

చిట్యాల: మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్‌లో స్వయంపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎండీ.రాజ్‌మహ్మద్ తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు ఒక రోజు ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయులుగా ముష్కె మానస, డీఈఓగా చిలుకల తేజస్విని, డిప్యూటీ డీఈఓగా పుల్ల అక్షయ, ఎంఈఓగా వెలకంటి రక్షిత, అలాగే పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి బోధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం డివిజన్‌లో కలపాలి



మాట్లాడుతున్న పాయం సత్యనారాయణ

వెంకాపురం(కె): వెంకటాపురం, వాజేడు మండలాలను భద్రాచలం డివిజన్‌లో కలపాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అన్నారు. గురువారం మండల పరిధిలోని సూరవీడ గ్రామంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటాపురం, వాజేడు మండలాల ప్రజలు సమస్యల పరిష్కరం కోసం ములుగు జిల్లా కేంద్రానికి వెళితే భద్రాచలం వెళ్లాలని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మండలాల సమస్యలను పట్టించుకునే వారే లేకుండా పోయారని, ఈ రెండు మండలాలను భద్రాచలం డివిజన్‌లో కలపాలని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆదివాసీ ప్రజలు రాజకీయ పార్టీల మాయ మాటలకు మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో సున్నం సూరిబాబు, నరేష్, సురేంద్ర, వెంకటేష్, కనితి వెంకటకృష్ణ తదితరులు ఉన్నారు.

ఉచిత సౌర విద్యుత్ అందించడమే లక్ష్యం

మహదేవపూర్: ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజలీ యోజన ద్వారా దేశవ్యాప్తంగా ఇళ్లకు సోలార్ రూఫ్ ప్లాంట్లను 40 శాతం వరకు సబ్సిడీతో నిర్మించి నెలకు 300 యూనిట్ల వరకు ఉచితంగా సౌర విద్యుత్‌ను అందించడమే లక్ష్యమని సబ్ డివిజన్ తపాలా శాఖ అధికారి అజారుద్దీన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్‌ముఫ్త్ బిజలీ యోజన లబ్ధిదారుల ఎంపికను కేంద్ర ప్రభుత్వం తపాలాశాఖకు అప్పగించిందని తెలిపారు. ప్రజలు విద్యుత్ బిల్లు, ఫోన్ నంబర్ తదితర వివరాలను తపాలా కార్యాలయంలో సిబ్బందికి అందిస్తే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు.

గిరిజన జాతరలకు నిధులు కేటాయించాలి



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న పూజారులు

ములుగు రూరల్: ఆదివాసీ గిరిజన జాతరలకు నిధులు కేటాయించాలని బాల కుమారస్వామి, జాతర పూజారుల సంఘం సభ్యులు కొట్టెం సారయ్య అన్నారు. గురువారం రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ధనసరి సీతక్కకు జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్యతో కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడారం మహా జాతర ముగిసిన అనంతరం ఆదివాసీ గిరిజనులు బాలగోముడు, ముసలయ్య వంటి జాతరలు నిర్వహిస్తారని వాటికి నిధులు కేటాయించాలని అన్నారు. ఈ నెల 6 నుంచి 09 వరకు జాతర నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పూజారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరి



సమావేశంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

కన్నాయిగూడెం: ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని వైద్యాధికారి మౌనిక అన్నారు. గురువారం పల్స్ పోలియో కార్యక్రమంపై సిబ్బందితో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో ఐదు సంవత్సరాలలోపు పిల్లలు 1610 మంది ఉన్నారని ఈనెల 3న వారందరికి తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయాలన్నారు. నూరు శాతం పోలియో చుక్కల కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సమ్మక్క, హెల్త్ ఎడ్యుకేటర్ తిరుపతయ్య, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్, భాస్కర్‌తోపాటు తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

మహాముత్తారం: మండలంలోని కేశవాపూర్ గ్రామానికి చెందిన పుల్యాల లక్ష్మి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు రూ.5వేల ఆర్థిక సాయం అందజేసి పరామర్శించారు. నిమ్మగూడెం మాజీ సర్పంచ్ కండెల ప్రమీల, కాంగ్రెస్ పార్టీ మండల సంయుక్త కార్యదర్శి ధన్‌సింగ్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ అజయ్, నాయకులు, కండెల వినోద్, ఇస్లావత్ పరశురాం, జాడి సుదర్శన్, గౌరవేణి రాజయ్య, జడల కుమారస్వామి, జాడి సడవలి, గౌరవేణి రఘుపాల్, తడప్ల మాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లిలో మాజీ సర్పంచ్ నల్లబెల్లి రమారవీందర్, ఎంపీటీసీ ఏనుగు తిరుమలలచ్చిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు గురువారం గ్రామాభివృద్ధి కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ వివరాలను వెల్లడించారు. కమిటీ అధ్యక్షుడిగా దాసారపు సదానందం, ప్రధాన కార్యదర్శిగా పుప్పాల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా శంకర్, దిలీప్‌రెడ్డి, సంపత్, వీరస్వామి, కుమార్, పిట్టల వీరస్వామి, లోహిత్‌రెడ్డి, శ్రావణ్, ముఖ్య సలహాదారులుగా నల్లబెల్లి రవీందర్, ఏనుగు లచ్చిరెడ్డి, రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సెకండియర్ పరీక్షలు ప్రారంభం

కాటారం: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజులో భాగంగా మండలంలో ఏర్పాటు చేసిన మూడు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు తెలుగు, సంస్కృతం పరీక్షలు రాశారు. కాటారం ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 169 విద్యార్థులకు గాను 163 మంది, గిరిజన బాలుర సంక్షేమ కళాశాల పరీక్షా కేంద్రంలో 160 మంది విద్యార్థులకు గాను 156 మంది, గంగారం మోడల్ కళాశాల పరీక్షా కేంద్రంలో 162 మంది విద్యార్థులకు గాను 159 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు నరేందర్, బుచ్చయ్య, మధు తెలిపారు. పరీక్షా కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ ప్రసాద్ బృందం తనిఖీ చేసి పరీక్ష కొనసాగుతున్న విధానంను పరిశీలించారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, గిరిజన బాలికల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని గిరిజన బాలికల కళాశాలలో ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 136 మందికి 135 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ వసుందర, డీఓ జోతీర్మయి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 314 మందికి 307 మంది హాజరైనట్లు చీఫ్‌సూపరింటెండెంట్ పవన్‌రాజ్ తెలిపారు.

మండల అధ్యక్షుడిగా కుమార్



చిట్యాల: కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన అల్లకొండ కుమార్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తనను మండల యూత్ అధ్యక్షుడిగా నియమించినందుకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు, రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు శివసేనరెడ్డి, బండ శ్రీకాంత్‌లకు కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

అసాంఘిక శక్తులకు సహకరించొద్దు

● ఎస్సై వెంకటేశ్వరరావు



బొల్లారంలో మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వరరావు

వాజేడు: అసాంఘిక శక్తులకు సహకరించొద్దని ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో గురువారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఎస్సై మాట్లాడుతూ.. అసాంఘిక శక్తులను గ్రామాల్లోకి రానివ్వొద్దని సూచించారు. అనంతరం మండల పరిధిలోని ఘణపురం వద్ద వాజేడు, భద్రాచలం రహదారిపై వాహన తనిఖీలను నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని సోదాలు చేశారు.

వాహనాల తనిఖీ

మహాముత్తారం: మండలంలోని యామన్‌పల్లి ప్రధాన కూడలిలో గురువారం మహాముత్తారం ఎస్సై మహేందర్‌కుమార్ యాదవ్ వాహనాలు తనిఖీ చేపట్టారు. వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితులతో మాట్లాడి వదిలేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనదారులకు తప్పకుండా వాహన పత్రాలతోపాటు డ్రైవింగ్‌లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. మద్యం తాగి వాహనం పడిపితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఎస్సై వెంట సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.



వాజేడు: బస్సును తనిఖీ చేస్తున్న పోలీసులు



మహాముత్తారం: వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై

ఘనంగా సేవాలాల్ జయంతి



నైవేద్యం సమర్పిస్తున్న పూజారి

మహాముత్తారం: సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని పెగడపల్లి గ్రామంలో గురువారం లంబాడీలు సేవాలాల్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లంబాడీల ఆచారం ప్రకారం పూజలు నిర్వహించి దాండియా ఆడిపాడారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ లింగమల్ల శారదతోపాటు మండలంలోని వివిధ తండాలకు చెందిన లంబాడీలు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నియామకం



వాజేడు: బహుజన సమాజ్ పార్టీ మండల నూతన అధ్యక్షుడిగా బల్సుపాటి పోతురాజును నియమించారు. మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో గురువారం బహుజన సమాజ్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని భద్రాచలం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి పోతురాజుకు నియామక పత్రాన్ని అందించారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీగా పూనెం ముఖేష్‌కు జిల్లా అధ్యక్షుడు నడిపింటి మధు మహరాజ్ బాధ్యతలను అప్పగించారు. ఈ సమావేశంలో రఘూ, శివకుమార్, సిద్దార్థ పూలే, దనాకర్ ఉన్నారు.